# ప్రమాదంలో శ్రీ సీతారాముల దేవస్థానం

**– శ్రీరాముని కాపాడుకునేందుకు ప్రజల ఆవేదన**
**– అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి**



గద్వాల ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి): ధరూర్ మండలంలోని నీలహళ్లి గ్రామ సమీపాన ఉన్న శ్రీ సీతారాముల దేవస్థానం ఎంతో మహోన్నతమైన, అద్భుతమైన, ప్రశాంతమైన వాతావరణంలో ఈ దేవాలయం ఉంది. అయితే కొందరు ఆ గట్టుకున్న ఎర్ర మట్టిని తవ్వేస్తున్నారు. చుట్టూ పంట పొలాలు పచ్చని వాతావరణంతో పక్షుల కిలకిల రాగాలతో ప్రశాంతంగా ఉండే ఈ దేవాలయానికి ఇప్పుడు ప్రమాదం పొంచి ఉంది. ఈ గట్టు చుట్టూ ప్రభుత్వం కొంతమందికి వ్యవసాయం చేసుకునేందుకు కొంత కొంత భూమిని ఇచ్చింది. దీనిని ఆసరాగా చేసుకుని అవసరానికి అన్నట్టుగా ఆ మట్టిని రాత్రి వేళలో ఎర్ర మట్టిని తరలిస్తున్నారు. దీని ద్వారా దేవాలయం అంచున ఉన్న పై పొర రోజు రోజుకు వర్షాలకు కోత గురై గట్టు కింద త్రవ్విన పాదుల్లో మట్టి చేరి దేవాలయమే కంటికి కనిపించకుండా పోయే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వ్యవసాయం చేసుకునేందుకు భూమిని అప్పచెబితే తవ్వకాలు జరపడం ఎంతవరకు న్యాయమని ప్రజలు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో శివ రాజా, రామాంజనేయులు, పల్లెన్న, రంగస్వామి, ఓబులప్ప, లొల్లి రంగన్న,కురుమన్న, సవరప్ప తదితరులు ఉన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు



మెట్ పల్లి ఫిబ్రవరి 11 (వుదయం విలేఖరి) మున్సిపల్ సాధారణ ఎన్నికల్లో భాగంగా మెట్ పల్లిలో బుధవారం జరిగిన పోలింగ్ లో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ చిట్నేని రఘు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు పట్టణంలోని 24వ వార్డులో ఏర్పాటు చేసిన 68వ పోలింగ్ బూత్ లో ఓటు వేసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారన్న నమ్మకం ఉందన్నారు.

## పోలింగ్ సరళి పరిశీలన...

**– ఓటు హక్కును వినియోగించుకున్న జువ్వాడి బ్రదర్స్**



కోరుట్ల ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి) రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కోరుట్ల నియోజకవర్గంలోని కోరుట్ల మెట్పల్లి మున్సిపాలిటీ లలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అనంతరం కోరుట్ల పట్టణ 13 వ వార్డులో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆయన సోదరుడు జువ్వాడి శేఖర్ రావులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు అనంతరం జువ్వాడి నర్సింగరావు పత్రికా విలేకరులతో మాట్లాడుతూ కోరుట్ల మెట్ పల్లి మున్సిపాలిటీ లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు కోరుట్ల మెట్పల్లి మున్సిపాలిటీలపై తప్పకుండా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు తోపాటు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు మున్సిపాలిటీల పై జెండా ఎగరవేస్తాం...

**– కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్**




మెట్ పల్లి ఫిబ్రవరి 11 (వుదయం విలేఖరి) కోరుట్ల మెట్పల్లి రెండు మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని రెండు మున్సిపల్ లలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే చైర్మన్ గా కొనసాగనున్నారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే సంజయ్ దంపతులు ఓటు హక్కు వినియోగించారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము చేసిన అభివృద్ధి పనులు తమ పార్టీని గెలిపిస్తాయని దిమా వ్యక్తం చేశారు.

# సేవ చేసే నాయకులకే పట్టం కట్టండి

**– మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**
**– కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న పుట్ట మధూకర్, శైలజ దంపతులు**
**– 13 వార్డుల్లోనూ 'గులాబీ' గెలుపు ఖాయమని ధీమా**



మంథని ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి): ''మన కోసం, మన కష్టసుఖాల కోసం అనునిత్యం అందుబాటులో ఉండి సేవ చేసే వారినే నాయకులుగా ఎన్నుకోవాలి" అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా బుధవారం మంథని పట్టణంలోని 1వ వార్డు చైతన్యపురి కాలనీలో గల జిల్లా పరిషత్ హైస్కూల్ (బాలుర) పోలింగ్ కేంద్రంలో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆయన సతీమణి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ మరియు కుటుంబ సభ్యులు కూడా ఓటు వేశారు. ఓటు వేసిన అనంతరం పుట్ట మధూకర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైన ఆయుధమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు బాధ్యతగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఈ సువర్ణావకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంథని పట్టణాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపామని ఆయన గుర్తు చేశారు. నేడు మంథని పట్టణం ఎంతగా అభివృద్ధి చెందిందో ప్రజలందరికీ తెలుసని, ఆ అభివృద్ధిని చూసే ప్రజలు ఓట్లు వేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల కోసం పోరాడుతున్నామని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన...



జగిత్యాల ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి) జిల్లాలో 5 మున్సిపాలిటీలలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జగిత్యాల మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్లను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామారావు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ తో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా పోలింగ్ ఏర్పాట్లు సిబ్బంది హాజరు మౌలిక సదుపాయాలు భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పారదర్శకంగా ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు అలాగే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా త్వరితగతిన పూర్తి అయ్యేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆర్ఓ అధికారులకు ఆదేశించారు అంతకుముందు మెట్ పెల్లి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాన్ని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ పరిశీలించారు పోలింగ్ జరుగుతున్న సరళి ఓటర్లకు కల్పించిన సదుపాయలను ప్రత్యక్షంగా పరుశీలించారు అలాగే పోలింగ్ సిబ్బంది ఓటర్లకు ఓటు హక్కు వినియోగించే తీరును పరిశీలించారు.

ఈ పరిశీలనలో స్పెషల్ ఆఫీసర్లు మున్సిపల్ కమిషనర్లు తహసీల్దార్లు ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకుల్లో కేవైసీ చేయించుకుంటేనే ఖాతా అప్డేట్ అవుతుంది

**– ఫీల్డ్ ఆఫీసర్ శ్రీలత**



రాయపర్తి వుదయం ప్రతినిధి:బ్యాంకుల్లో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ కేవైసీ చేయించుకుంటేనే ఖాతా అప్డేట్ అయి ప్రభుత్వము నుండి వచ్చే సబ్సిడీలు వివిధ సంక్షేమ పథకాలు లబ్ధి నేరుగా ఖాతాలో జమ ఐతాయని ఎస్బిఐ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీలత అన్నారు. బుధవారం మండలంలోని కిష్టాపురం గ్రామంలో వర్ధన్నపేట సి ఎఫ్ ఎల్ సెంటర్ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ వీక్ ( ఎఫ్ ఎల్ డబ్లు) అవగాహన కార్యక్రమం నిర్వహించగా. రాయపర్తి ఎస్బిఐ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీలత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా కేవైసీని అప్డేట్ చేసుకోవాలని సూచించారు. కేవైసీ పూర్తయితే ఖాతా యాక్టివ్ గా ఉండి ప్రభుత్వ సబ్సిడీలు , వివిధ సంక్షేమ పథకాలు లబ్ధి నేరుగా ఖాతాలో జమవుతుందని తెలిపారు. అనంతరం వర్ధన్నపేట సిఎఫ్ఎల్ కౌన్సిలర్ ఐత కమలాకర్ మాట్లాడుతూ కేవైసీ అప్డేట్ తో పాటు అనవసరమైన లింకులను ఓపెన్ చేయకుండా జాగ్రత్త గా ఉండాలని, ఎవరు కూడా మనీ మ్యూల్ బారిన ఉండాలని కూడా సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీలక్ష్మి, గ్రామ ఉపసర్పంచ్ తోట సోమ నరసయ్య, గ్రామ వార్డు సభ్యులు గ్రామస్తులుప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధర్మసాగర్ జెడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాలలో సదస్సు.



ఫిబ్రవరి 11 (ధర్మసాగర్ వుదయం ప్రతినిధి): ఈరోజు శాస్త్రవేత్త చార్ల్స్ డార్విన్ జయంతి సందర్భంగా "డార్విన్ పరిణామ సిద్ధాంతం మరియు మానవ నాగరికత పురోగతి" అనే అంశంపై అర్థవంతమైన, ఆలోచనాత్మక సదస్సు ధర్మసాగర్‌లోని జెడ్‌పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహించబడింది.

ఈ కార్యక్రమాన్ని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న కె. బి. ధర్మ ప్రకాష్, రాష్ట్ర పర్యావరణ ఉపసమితి కన్వీనర్, జేవీవీ తెలంగాణ మాట్లాడుతూ, పరిణామ ప్రక్రియలో మానవుని ఆవిర్భావం భూమిపై జీవ పరిణామ యాత్రలో ఒక చారిత్రక మైలురాయిగా పేర్కొన్నారు. డార్విన్ ప్రతిపాదించిన సహజ వరణం ద్వారా పరిణామ సిద్ధాంతం జీవుల ఉద్భవం మరియు అభివృద్ధి పై మన అవగాహనను విప్లవాత్మకంగా మార్చిన గొప్ప శాస్త్రీయ సిద్ధాంతమని వివరించారు. డార్విన్ రచించిన ప్రముఖ గ్రంథం "ఆన్ ది ఆరిజిన్ ఆఫ్ స్పీషీస్" ను ఉదహరిస్తూ, సహజ వరణం ద్వారా లక్షల సంవత్సరాల పాటు జీవులు నెమ్మదిగా పరిణామం చెందాయని అందులో సమగ్ర శాస్త్రీయ ఆధారాలతో వివరించబడిందని తెలిపారు. పరిణామం కేవలం జీవశాస్త్ర అంశమే కాకుండా, మానవ నాగరికత పురోగతిని, హేతువాదాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. మానవ మేధస్సు, భాష, సంస్కృతి, సాంకేతికతల అభివృద్ధి కూడా నిరంతర పరిణామ ప్రక్రియ ఫలితమని ఆయన వివరించారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, హేతుబద్ధమైన విచారణ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఇవే సమాజ పురోగతికి మరియు జాతీయాభివృద్ధికి అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థులు ప్రదర్శించిన "మానవ పరిణామం" పై నాటిక నిలిచింది. ఆదిమ కోతి నుంచి ఆధునిక మానవుడి వరకు పరిణామ దశలను సృజనాత్మకంగా చూపిస్తూ విద్యార్థులు ఆ భావనను సరళంగా, ఆకర్షణీయంగా ప్రేక్షకులకు అందించారు. ఈ నాటికకు ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవితా దేవి, సురేష్, కిరణ్మయి, రామకృష్ణ, రమ్యశ్రీ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి..




వర్ధన్నపేట వుదయం ప్రతినిధి: మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా నేడు దేశవ్యాప్తంగా జరుగు సమ్మె జయప్రదం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరీ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమెరికా ట్రంప్ ప్రభుత్వానికి లొంగిపోయి ఆదేశ వ్యవసాయ ఉత్పత్తులపై ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతి చేసుకొనుటకు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకన్నది. ఈ ఒప్పందం వల్ల ఆ దేశ ఉత్పత్తులైన మొక్కజొన్న పత్తి సోయాబీన్ తదితర పంటలు పాల ఉత్పత్తులు భారతదేశంలోకి దిగుమతి అయితాయని జిల్లా ప్రధాన కార్యదర్శి సూరి అన్నారు. అమెరికా ప్రభుత్వం ఆ దేశ వ్యవసాయ రంగానికి 50 శాతం సబ్సిడీలు ఇస్తే భారత ప్రభుత్వం వ్యవసాయ రంగానికి మూడు శాతం మాత్రమే ఇస్తుంది అన్నారు. దేశ రైతాంగం 13 నెలలు నీరవదికంగా చేసిన రైతాంగ ఉద్యమ ఫలితంగా ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిదాని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హర్షం సుధాకర్ దార లింగన్న కత్తుల కొమురయ్య మల్లేశం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిధిలో ప్రశాంతంగా కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికలు...

**– జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్**



జగిత్యాల ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి) జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ తెలిపారు ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా ఎస్పీ వివిధ ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ప్రతి ఓటరు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు పెట్రోలింగ్ వాహనాలు ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని తెలిపారు పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో ఎస్పీ అశోక్ కుమార్ తో పాటు డీఎస్పీ రఘు చందర్ ఇన్స్పెక్టర్ లు కరుణాకర్ రవి ఎస్ఐ లు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న టిఆర్పి జిల్లా అధ్యక్షులు రవి పటేల్.



భూపాలపల్లి జిల్లా ఫిబ్రవరి 11(వుదయం ప్రతినిధి): భూపాలపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న 2026 సాధారణ ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ మరియు వారి సతీమణి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం రవి పటేల్ మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరఫున పోటీలో నిలిచిన ఐదుగురు అభ్యర్థులకు అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలిపారు. డబ్బులు, మద్యం విచ్చలవిడిగా ప్రవహిస్తున్న ఈ ఎన్నికల వాతావరణంలోనూ, ఎలాంటి లాభాపేక్ష లేకుండా, మొక్కవోని ధైర్యంతో నిస్వార్థంగా ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేసిన అభ్యర్థులు ప్రజల మన్ననలు పొందారని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు ఎలా స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యబద్ధంగా వినియోగించుకోవాలో ప్రజలకు తెలియజేస్తూ, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ చివరి నిమిషం వరకు పోరాటం చేసిన అభ్యర్థులు తెలంగాణ రాజ్యాధికార పార్టీకి గర్వకారణమని తెలిపారు. రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆశీస్సులతో భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగా ప్రత్యర్థులతో పోటీపడి ప్రచారం కొనసాగించిన అభ్యర్థులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుత ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల ద్వారా జరుగుతున్న డబ్బు, మద్యం, అధికార దుర్వినియోగాన్ని ప్రజలు గమనించాలన్నారు. ప్రజలు ఎల్లప్పుడూ ప్రజాస్వామిక పద్ధతిలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, భవిష్యత్ రాజకీయాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీనే సరైన ప్రత్యామ్నాయమని రవి పటేల్ స్పష్టం చేశారు.

## విద్యార్థిని అభినందించిన ప్రిన్సిపాల్



హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి): కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటోనమస్), హనుమకొండలో ఈరోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ శ్రీ ఉప్పుల శివ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ (రిపబ్లిక్ డే) పరేడ్‌లో పాల్గొని వచ్చిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రధాన ద్వారం నుంచి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు డ్రమ్స్ వాయిస్తూ, చప్పట్లు కొడుతూ శివను ప్రిన్సిపాల్ గారి వద్దకు తీసుకువచ్చారు. ప్రిన్సిపాల్ గారు శివను శాలువాతో సత్కరించి, కళాశాల తరఫున అభినందనలు తెలియజేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలలో నుండి ఈసారి రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం దక్కిన ఏకైక విద్యార్థి శివనేనని కొనియాడారు. కళాశాల కీర్తిని ఢిల్లీ వరకు చాటిచెప్పినందుకు ఆయనను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సీతారాములు, డా. గంగిశెట్టి శ్రీనివాస్, డా. సంధ్యారాణి, డా. ధనసింగ్, ఎన్‌సిసి ఆఫీసర్లు డా. రాజేందర్, డా. ప్రసూన, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా. రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా. శ్రీనాథ్, పరీక్షల నియంత్రణ అధికారి డా. శివ నాగ శ్రీను, అధ్యాపకులు డా. కోమల, డా. విజయలక్ష్మి, డా. సమ్మయ్య, డా. రవీందర్, డా. జె. చిన్న, డా. వెంకన్న తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో శివ మాట్లాడుతూ, ఎంతో కష్టతరమైన శిక్షణ అనంతరం రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం లభించడం తనకు గర్వకారణమని తెలిపారు. ఢిల్లీ పర్యటనకు ఆర్థికంగా మరియు నైతికంగా సహకరించిన కళాశాల అధ్యాపకులు డా. రవికుమార్, డా. బి. శ్రీనివాస్ రాథోడ్, డా. కవిత, డా. శ్రీదేవి, డా. రాజయ్య, డా. శివ నాగ శ్రీను, డా. సీతారాం తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# రైతుల ఉసురు తీస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.

- ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లో దొరకని యూరియా.
- అవస్థలుపడుతున్న రైతులు.



భూపాలపల్లి ఫిబ్రవరి 11(వుదయం ప్రతినిధి): ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను రద్దు చేసి పాతవిధానంలోనే యూరియా అందివ్వాలినీ ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ మరియు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు టేకుమట్ల మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రభుత్వాలు యూరియా కోసం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను తీసుకుని వచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు బుకింగ్ యాప్ పైన అవగాహన లేక, మరియు రైతులకు స్మార్ట్ ఫోన్ లు లేక అనేక అవస్థలుపడుతున్నారు. బుకింగ్ యాప్ పైన అవగాహన ఉన్న రైతులు యూరియా బుకింగ్ కోసం చూస్తే యూరియా బస్తాలు నిల్వ ఉ ఒడటం లేదని, అవసరం లేని రైతులు పెద్ద మొత్తంలో యూరియా బస్తాలు బుకింగ్ చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని అన్నారు.రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను రద్దు చేసి, పాతవిధానంలోనే రైతులకు యూరియా అందించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ మండల కార్యదర్శి అంబాల అశ్వథామ తదితరులు పాల్గొన్నారు.

# తేరట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా: ELV భాస్కర్



గట్టుప్పల్, ఫిబ్రవరి 11 (వుదయం విలేఖరి): నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జూఎం భాస్కర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులతో సమావేశమై పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాలకు స్టేజ్ నిర్మాణం, క్రికెట్ మరియు కోకో క్రీడా సామగ్రి, క్రీడా కిట్లు, స్పోర్ట్స్ డ్రెస్సులు, షూస్ అందజేయడంతో పాటు, శుద్ధి చేసిన తాగునీటి కోసం వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం శుభ్రమైన టాయిలెట్లు నిర్మించడంతో పాటు అందమైన గార్డెన్‌ను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.తేరట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని జూఎం భాస్కర్ అన్న స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి సీఎం కప్పులో విజయాలు సాధించిన మధిర నియోజకవర్గ క్రీడాకారులు.



మధిర ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి): ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిన్న జరిగిన సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడల్లో మధిర నియోజకవర్గ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు వై చిన్ని తెలియజేస్తూ నిన్న జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో మధిర నియోజకవర్గానికి కోకో విభాగంలో బాలికలు మొదటి బహుమతి,బాలురు మొదటి బహుమతి సాధించారు. కబడ్డీలో బాలికలు రెండో బహుమతి,బాలురు మూడో బహుమతి గెలుచుకున్నారు. మన క్రీడాకారుల పట్టుదల, కష్టపడిక ఫలితంగా ఈ విజయాలు వచ్చాయి అని పేర్కొన్నారు.రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలంగాణ క్రీడా అభివృద్ధికి నిబద్ధమైన నాయకుడు మధిర క్రీడాకారులను అభినందిస్తూ మాట్లాడుతూ మీ ప్రతిభకు,అచంచల పట్టుదలకు నా హృదయపూర్వక అభినందాలు. గ్రామీణ యువతకు క్రీడాలు అవకాశాలు కల్పించడమే సీఎం కప్ లక్ష్యం.విజయాలు మధిర నియోజకవర్గాన్ని,ఖమ్మం జిల్లాను గర్వపడేలా చేశాయి.రాష్ట్ర స్థాయి వరకు ముందుకు సాగి మరిన్ని గొప్ప విజయాలు సాధించండి అని ప్రోత్సహించారు.మధిర మండల తాసిల్దార్ రాంబాబు,మధిర మండల ఎంపీడీవో వెంకటేశ్వర్లు,మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సంపత్,మధిర టౌన్ సిఐ రమేష్ క్రీడాకారులను మరియు నియోజకవర్గ పిడి,పిఈటి లను అభినందించారు.ఈ విజయాలు మధిరలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేస్తాయని అందరూ ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి.గౌరరాజు ధనలక్ష్మి.



మధిర ఫిబ్రవరి 11(వుదయం ప్రతినిధి): ఫిబ్రవరి 12 న జరిగే కార్మికుల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మధిర మండలంలో ఉన్న మధ్యాహ్న భోజన వర్కర్లంతా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(CITU) నాయకులు గౌరరాజు ధనలక్ష్మి విజ్ఞప్తి చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక రైతు వ్యతిరేక వ్యవసాయ కూలీల వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ మరియు నూతన విద్యుత్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సమ్మెలో కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు పేద ప్రజలు అందరూ స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రమాదేవి, చిన్ని,మాడపాటి కమల,సుతారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్లమ్మ బోనాలు



జన్నారం, ఫిబ్రవరి 11(వుదయం విలేకరి) జన్నారం గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం రేణుక ఎల్లమ్మ బోనాలు గత ఐదు రోజుల క్రితం ప్రారంభమై బుధవారంతో ముగిశాయి. మంగళవారం రాత్రి మహిళలు ఇంటికొక బోనం చొప్పున బోనాలను తీసుకొని వెళ్లి ఎల్లమ్మకు సమర్పించారు.బుధవారం రోజు ఆలయం వద్ద బైండ్ల కులస్తుల చేత పట్నాలు వేసి మేకపిల్లను గావు పట్టారు. ఐదు రోజులుగా జరుగుతున్న బోనాల పండుగకు గౌడ కులస్తులే కాకుండా అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. బుధవారం ఆలయ సమీపంలోని తాటి చెట్టును 13 మంది గీతా కార్మికులకు ఎక్కి చెట్టు నుండి ఒకరి నుంచి ఒకరు కల్లు కుండ ను తీసి అమ్మవారికి సమర్పించారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అవగాహనతో ఉండాలి

- సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్



వర్ధన్నపేట వుదయం ప్రతినిధి: మండలం నల్లబెల్లి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్లబెల్లి గ్రామ ప్రథమ పౌరురాలు జక్కి అనిత శ్రీకాంత్ , తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సౌజన్య హాజరై అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ఈ కేవైసీ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తూ సైబర్ నేరగల పట్ల అవగాహనతో మెలగాలని ఎలాంటి ఓటీపీలు ఎవరికి చేరు చేయకూడదని తెలియజేశారు.అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఇన్సూరెన్స్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, ఆర్థిక అక్షరాస్యత కోఆర్డినేటర్ రాజేశ్వరి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన గారే వెంకటేష్



రాయపర్తి వుదయం ప్రతినిధి:వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మైలారం గ్రామానికి చెందిన తెలంగాణ కార్మిక సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల వెంకటసాయిలు కూతురు శ్రావణి – డేవిడ్ ల వివాహ వేడుకలో బుధవారం తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గారే వెంకటేష్ మాదిగ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఐత సాయిలు, నియోజకవర్గ అధ్యక్షులు ఆకులపల్లి రవి, గారే శ్రీనివాస్, యూత్ రాష్ట్ర అధ్యక్షులు గారే సందీప్ , చెడుపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు



కోదాడ: ఫిబ్రవరి 11(వుదయం): కోదాడ మున్సిపల్ పరిధిలోని 28వ వార్డులో తాజా కౌన్సిలర్, కోదాడ మాజీ సర్పంచ్ యెర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు అమూల్యమైన హక్కు అని, అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్న నాయకత్వానికే ప్రజలు పట్టం కట్టాలని ఈ సందర్భంగా కోరారు.

# ఉద్యమకారుల ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

- జాగృతి జిల్లా నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్ పిలుపు



సిద్దిపేట, ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో ఈ నెల 12 న హైదరాబాదులోని బాగ్ లింగంపల్లి ఆర్టీసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నఈ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని జాగృతి జిల్లా నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సభ గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుందని తెలిపారు. సిద్దిపేట జిల్లా నుండి పెద్ద ఎత్తున ఉద్యమకారులు, జాగృతి కార్యకర్తలు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా ఈ సభ కీలకమైందని పేర్కొంటూ, జిల్లా నాయకులు, కార్యకర్తలు సమయానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భారీ స్థాయిలో జనసమ్మేళనం ఉండేలా జిల్లా నాయకత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# వాట్సాప్ లో మతం పేరుతో ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు.

- మతాన్ని అడ్డుకు పెట్టుకుని ఓటు ను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నం.
- ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు.
- వన్ టౌన్ సీఐ బి సునీల్ కుమార్



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మతాన్ని అడ్డుగా పెట్టుకుని ఓటర్లను ప్రభావితం చేసే విధంగా వాట్సాప్‌లో వివాదాస్పద ప్రచారం చేస్తున్న వ్యక్తిపై ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి. సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన చంద్రశేఖర్ ఏ చందు అనే వ్యక్తి "హుండీలలో విరాళాలు వేయడం వల్ల హిందూ మతం రక్షించబడదు, బ్యాలెట్ బాక్స్ నందు హిందువు ఓటు వేయడం ద్వారా రక్షించబడుతుంది" అనే సందేశాన్ని వాట్సాప్‌లో ప్రసారం చేస్తూ మతం పేరుతో ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మతం, కులం పేరుతో ఓటర్లను ప్రలోభపెట్టడం లేదా రెచ్చగొట్టే ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

# ఎన్నికల విధుల్లో మానవత్వం చాటుకున్న కరీంనగర్ రూరల్ పోలీస్.



కరీంనగర్, ఫిబ్రవరి 11, (వుదయం ప్రతినిధి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా, ఆరేపల్లి ఒకటవ డివిజన్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు తమ ఉదారతను చాటుకున్నారు.ఓటు వేయడానికి వచ్చిన ఒక వికలాంగుడైన వృద్ధుడు నడవలేని స్థితిలో ఉండటాన్ని గమనించిన కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, వెంటనే స్పందించి వీల్ చైర్ ఏర్పాటు చేశారు. స్వయంగా ఆ వృద్ధుడిని వీల్ చైర్ సహాయంతో పోలింగ్ స్టేషన్ లోనికి పంపించి, ఆయన తన ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఓటరుకు సులభంగా ఓటు వేసే అవకాశం కల్పించడం తమ బాధ్యతని, ముఖ్యంగా దివ్యాంగులు మరియు వృద్ధులకు అవసరమైన సహాయం అందించేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలలో గెలుపు కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు


- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి ఫిబ్రవరి 11 (వు దయం ప్రతినిధి) కల్వకుర్తి, ఆమనగల్ పట్టణాలలో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డులలో శ్రమించిన ఇన్‌చార్జీలు, వారితో పాటు పనిచేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, బచ్చు రామకృష్ణ, వై కృష్ణారెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, మట్ట వెంకటయ్య గౌడ్, శంకర్ నాయక్ తో పాటు పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులందరికీ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో హృదయపూర్వక అభినందనలు. ధన్యవాదాలు తెలియజేశారు.

# గద్వాలలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్

- **65282 మంది ఓటర్లు ఉండగా**
- **ఓటు హక్కు వినియోగించుకున్న వారు 48679**
- **74.57% పోలింగ్ శాతం నమోదు**



గద్వాల ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గద్వాల పట్టణ పరిధిలో గల 37 వార్డులకు గాను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు మధ్య జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ ఐదు గంటలకు పూర్తయింది. ఈ మున్సిపల్ పరిధిలో 37 వార్డులకు గాను పోటీలో నిలబడిన అభ్యర్థులకు చెమటలు పట్టించేలా ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పుకోవచ్చు. బ్యాలెట్ బాక్స్ లో నిక్షిప్తమైన ఓట్లు ఈనెల 13న కౌంటింగ్ లో ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో.. అనేది శుక్రవారం వెలువడే ఫలితాల్లో గెలుపోటములు బయటపడతాయి. అందులో ఓటర్లు ఎవరికి పట్టం కట్టి గెలిపించారో విజేతలు ఎవరు అనేది తేలిపోనుంది. ఈ మున్సిపల్ పరిధిలో 65282 మంది మొత్తం ఓటర్లు ఉండగా, 48679 మంది తమ ఓటు హక్కు వినియోగించు కున్నారు. మొత్తం పోలింగ్ శాతం 74.57% నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈనెల 13వ తేదీన ప్రభుత్వ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

# కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికలలో 80.80 శాతం పోలింగ్ నమోదు



కల్వకుర్తి ఫిబ్రవరి 11 (వు దయం ప్రతినిధి) బుధవారం జరిగిన కల్వకుర్తి పురపాలక సంఘ ఎన్నికలలో 80,80 శాతం పోలింగ్ నమోదైనట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు ఓటు హక్కు వినియోగించుకున్న మొత్తం ఓటర్లు 21,027 అందులో పురుషులు 10,444 మహిళలు 10,583. కల్వకుర్తి పురపాల సంఘ మొత్తం ఓటర్లు 26,023 కాగా ఓటు హక్కు వినియోగించుకున్న వారు 21,027, 80.80%. పోలింగ్ నమోదైనట్లు పట్టణంలో భారీ పోలీస్ బందోబస్తు తో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు

# మున్సిపల్ పోలింగ్ ప్రశాంతం సిద్దిపేట జిల్లాలో 82.03 శాతం ఓటింగ్- జిల్లా కలెక్టర్

**సిద్దిపేట, వుదయం**

సిద్దిపేట జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీల్లో బుధవారం జరిగిన ఎన్నికల పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యంత ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి హేమావతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సగటున 82.03 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఆమె పేర్కొన్నారు. మరోవైపు, ఈ నెల 13న జరగనున్న ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం కౌంటింగ్ కేంద్రాల వద్ద 163 BNSS (గతంలో సెక్షన్ 144) అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ప్రకటించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో మొత్తం 1,01,085 మంది ఓటర్లు ఉండగా, 82,921 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుస్నాబాద్: 84.21%, దుబ్బాక: 85.05% చేర్యాల: 83.41%, గజ్వేల్ – ప్రజ్ఞాపూర్: 79.35% ఓటు వేసిన వారిలో 40,380 మంది పురుషులు, 42,536 మంది మహిళలు, ఐదుగురు ఇతరులు ఉన్నారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేసిన సిబ్బందిని, గట్టి బందోబస్తు నిర్వహించిన పోలీసు యంత్రాంగాన్ని కలెక్టర్ అభినందించారు.

# ఆరేపల్లి గ్రామంలో నీటి వృథా గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

**వుదయం , సిద్దిపేట:**



సిద్దిపేట జిల్లాలోని కోహెడ మండలం ఆరేపల్లి గ్రామంలో వాటర్ ట్యాంక్ నిండుగా నిండిపోవడంతో మంచినీరు వృథాగా కిందకు కారిపోతున్న ఘటన ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. గ్రామ వాటర్ సిబ్బంది నిర్లక్ష్య ధోరణి కారణంగానే ఈ పరిస్థితి నెలకొన్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.వాటర్ ట్యాంక్ పైభాగం నుంచి అధికంగా కారుతున్న నీటితో ట్యాంకు చుట్టూ నీరు నిల్వ ఉండి, అక్కడ బర్రెలు, గేదెలు చల్లదనం కోసం చేరుతున్నాయి. ఒకవైపు గ్రామంలో తాగునీరు సరైన సమయానికి అందక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు ఇంత పెద్ద మొత్తంలో నీరు వృథా కావడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యను పలుమార్లు గ్రామపంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సరైన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోయారు.

ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, ట్యాంక్ నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుని నీరు వృథా కాకుండా కాపాడాలని వారు కోరుతున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీని సరిచేసి, గ్రామానికి సమయానికి సరిపడా తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రధాన పార్టీ అభ్యర్థులకు చెమటలు పుట్టించిన ఏసి బుజ్జగింపులు బేఖాతరు..

## 3, 7 వార్డుల్లో 'హస్తం' రెబల్స్ సంచలనం!

**మంథని, వుదయం**

మంథని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారంతో ముగిసింది. అయితే, ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్ (BRS) అభ్యర్థుల కంటే, స్వతంత్ర అభ్యర్థుల హడావిడే ఎక్కువగా కనిపించింది. ముఖ్యంగా 3వ మరియు 7వ వార్డుల్లో 'ఏసీ' (Air Conditioner) గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులు ప్రధాన పార్టీల అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టించారనే చర్చ మంథని గల్లీల్లో జోరుగా సాగుతోంది. బుజ్జగించినా వినని వైనం.. తగ్గదేలేదన్న రెబల్స్!కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉండి, చివరినిమిషంలో టికెట్ దక్కక భంగపడ్డ 3వ వార్డు అభ్యర్థి సింగారపు కిష్టయ్య, 7వ వార్డు అభ్యర్థి ఇనుముల విజేత సత్యనారాయణలు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. వీరిని పోటీ నుంచి తప్పించేందుకు పార్టీ అగ్రనాయకత్వం, స్థానిక పెద్దలు రంగంలోకి దిగి తీవ్రంగా ప్రయత్నించారు. భవిష్యత్తులో మంచి పదవులు ఇస్తామని, పార్టీ కోసం పనిచేయాలని స్వయంగా పెద్దలు బుజ్జగించినప్పటికీ.. "ప్రజలే మా పక్షం.. వార్డు అభివృద్ధి మా లక్ష్యం" అంటూ వారు ససేమిరా అన్నారు. అధిష్టానాన్ని ఎదిరించి మరీ స్వతంత్రులుగా బరిలో నిలవడం ఇప్పుడు నియోజకవర్గంలో సంచలనంగా మారింది. పోలింగ్ రోజున 'ఏసీ' గుర్తు హవా! నిన్న జరిగిన పోలింగ్‌లో ఈ ఇద్దరు అభ్యర్థులు ప్రధా న పార్టీలకు ముచ్చెమటలు పట్టించా రు. పార్టీ గుర్తు లేకపోయినా, తమకు కేటాయించిన 'ఏసీ' గుర్తును ఓటర్లలోకి బలంగా తీసుకెళ్లడంలోఈఇద్దరూ సఫలీకృతమయ్యారు. ★3వ వార్డులో: సింగారపు కిష్టయ్య తనకున్న పాత పరిచయాలు, వ్యక్తిగత ఇమేజ్‌తో ప్రధానఓటు బ్యాంకుకు భారీగా గండి కొట్టారు. ★ 7వ వార్డులో: ఇనుముల విజేత సత్యనారాయణ నిర్వహించిన ప్రచార హోరు, యువత మరియు మహిళా ఓటర్ల మద్దతు ఆమెను గెలుపుముంగిట నిలబెట్టినట్లు సమాచారం. 13న తేలనున్న మున్సిపల్ భవితవ్యంమున్సిపాలిటీపై పట్టు సాధించాలని భావిస్తున్న ప్రధాన పార్టీలకు ఈ 'రెబల్' అభ్యర్థులు కొరకరాని కొయ్యగా మారారు. వీరుగెలిస్తే మంథని మున్సిపల్ పీఠం పై ఎవరి జెండా ఎగురుతుందనే విష యంలో స్వతంత్రులే 'కింగ్ మేకర్స్' అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నేటి తో పోలింగ్ ముగియగా, రేపు (ఫిబ్రవరి 13) వెలువడనున్న ఫలితాల్లో 'ఏసీ' గుర్తు సంచలనం సృష్టిస్తుందా? లేక ప్రధాన పార్టీల హవా కొనసాగుతుందా? అనేది తేలిపోనుంది.

# పేదల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ లక్ష్యం

## వట్టిపల్లి సర్పంచ్ చింతల విద్యాధర్ ముదిరాజ్

### లబ్ధిదారులకు 'ఇందిరమ్మ ఇళ్ల' ధ్రువీకరణ పత్రాల పంపిణీ

**జగదేవపూర్, వుదయం**



పేద ప్రజల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వట్టిపల్లి గ్రామ సర్పంచ్ చింతల విద్యాధర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని వట్టిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూ రైన లబ్ధిదారులకు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతి రెడ్డితో కలిసి ఆయన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విద్యాధర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది ప్రజల ప్రభుత్వమని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలబడుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి గ్యారెంటీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని, అందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. వట్టిపల్లి గ్రామంలో మొదటి విడతగా ఆరుగురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తమకు సొంతింటి కల నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుమలగిరిలో పోలింగ్ సరళి పరిశీలించిన కలెక్టర్

**సూర్యాపేట, వుదయం**

సూర్యాపేట జిల్లాలో జరుగుతున్న పురపాలక ఎన్నికల సందర్భంగా బుధవారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అక్షర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ఓటర్ల సౌకర్యాలు, భద్రతా చర్యలను పరిశీలించిన కలెక్టర్, ఓటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం: జిల్లా కలెక్టర్

**కరీంనగర్, వుదయం:**



రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు –2026 లో భాగంగా కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, మున్సిపాలిటీలకు బుధవారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఎన్నికల సరళని పర్యవేక్షించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టరేట్ నుండి ఎన్నికల తీరును పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కౌంటింగ్ ప్రక్రియ కోసం ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటర్ ను పరిశీలించారు. కరీంనగర్ లోని రోడ్లు భవనాల శాఖ ఎస్ ఈ కార్యాలయం, జ్యోతినగర్ లోని ఎస్సార్ ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్లను కలెక్టర్ సందర్శించారు. సెయింట్ ఆల్ఫోన్స్ హై స్కూల్లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్ ను పరిశీలించారు. ఈ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన వారికి మొక్కలు అందజేశారు.పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో ఓటర్ల సంఖ్య, అప్పటి వరకు నమోదైన పోలింగ్ శాతాన్ని అడిగి తెలు సుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ, ఆన్లైన్లో నివేదికలు సమర్పించాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. సాయంత్రం 5 గంటల్లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.రోడ్లు భవనాల శాఖ ఎస్ ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ లొకేషన్ లో ఉన్న పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి, జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపాలిటీలకు పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ స్క్రీన్ ల ద్వారా జిల్లా ఎన్నికల అధికారి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ఆవరణలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు ద్వారా అక్కడి పరిస్థితిని సమీక్షించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగియడంతో ఈనెల 13న జరిగే కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి పరిశీలించారు. ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ హాల్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఓట్ల లెక్కింపు వివరాలను నిర్దిష్ట ఫార్మాట్లో నమోదు చేయాలని అన్నారు. కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కళాశాలకు సెలవు...

**జగిత్యాల, వుదయం**

జగిత్యాల లోని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ సైన్స్ కళాశాలలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహించబడనున్నందున జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు 2026 ఫిబ్రవరి 12, 13వ తేదీలలో కళాశాలకు సెలవులు ప్రకటించబడినవి అందువల్ల బోధనా సిబ్బంది బోధనేతర సిబ్బంది విద్యార్థులు గమనించగలరు సంబంధిత సమాచారం విద్యార్థులకు తప్పనిసరిగా తెలియజేయవలసిందిగా సూచించబడింది

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్76.80 శాతం పోలింగ్ నమోదు

**లక్షెట్టిపేట్, వుదయం:**



మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం ఐదు గంటల వరకుకొనసాగింది.సాయంత్రం ఐదు గంటల సమయానికి క్యూ లైన్ లో వేచి ఉన్న ఓటర్లందరికి అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. లక్షెట్టిపేటలో మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉండగా, వార్డుకు రెండు చొప్పున మొత్తం 30 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.మున్సిపాలిటీ లో మొత్తం 18331 మంది ఓటర్లుండగా, వీరిలో 6727 మంది పురుషులు, 7351 మంది స్త్రీలు ఓటు వేశారు. మొత్తం 14078 ఓట్లు పోలై నట్లు అధికారులు వెల్లడించారు.

# జిల్లాలోని 5 మున్సిపాలిటీలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

## 5 గంటల వరకు 70.13శాతం పోలింగ్ నమోదు

### జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్

**జగిత్యాల, వుదయం**



జగిత్యాలజిల్లాలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు – 2026 సందర్భంగా జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో మున్సిపాలిటీలో బుధవారం పోలింగ్ ప్రశాంతంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ కొనసాగినట్లు జిల్లా ఎన్నికల అధికారి బి సత్యప్రసాద్ తెలిపారు ఐదు మున్సిపాలిటీల లో మొత్తం 136 వార్డులకు 379 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు ఓటర్లు ఎంతో చైతన్యంతో బాధ్యతాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు యువ ఓటర్లు ఎన్నికల ప్రక్రియ లో ఉత్సాహంగా పాల్గొన్నందున వారికి శుభాకాంక్షలు తెలిపారు ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడంలో సహకరించిన ప్రజలకు ఎన్నికల్లో పాల్గొని సమన్వయం తో పని చేసిన వివిధ స్థాయిల అధికారులకు పోలీస్ యంత్రాంగానికి ఎన్నికలలో పాల్గొన్న సిబ్బందికి ఎన్నికల సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసిన పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు పోలింగ్ కేంద్రాలలో అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించడం వల్ల జిల్లాలో 5 మున్సిపాలిటీలలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో తదుపరి ప్రక్రియలను కూడా నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తెలిపారు జిల్లా వ్యాప్తంగా నమోదైన పోలింగ్ శాతం జగిత్యాల 69.60 శాతం రాయికల్ 74.96 శాతం ధర్మపురి 75.16 శాతం కోరుట్ల 69.47శాతం మెట్పల్లి 69.21 శాతం మొత్తం 70.13 శాతం.

# మున్సిపల్ పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించిన కలెక్టర్

**సిద్ధిపేట, వుదయం**



గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మహతి విద్యనికేతన్ హైస్కూల్, బి.ఎం.ఆర్ డిగ్రీ కళాశాల, మైనారిటీ వెల్ఫేర్ కంప్యూటర్ సెంటర్ మరియు హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ స్వయంగా సందర్శించారు. ఓటింగ్ సరళిని పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 72 వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన 176 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు. సాయంత్రం 5 గంటల తర్వాత గేట్లు మూసివేసి, క్యూ లైన్లలో ఉన్న వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సీల్ చేసి, పోలీస్ ఎస్కార్ట్ మధ్య రిసెప్షన్ సెంటర్లకు తరలించి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తదితరులు ఉన్నారు.

# వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వికారాబాద్, వుదయం:**

11-2-26వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ,వికారాబాద్ జిల్లా పరిధిలోని నాల్గు నియోజకవర్గాల్లో జరుగుతున్న , పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జన్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ఓటర్లు విధిగా తమ హక్కును వినియోగించు కోవడానికి పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలి రావాలని ఓటర్లకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకుంటున్న దృష్ట్యా, ప్రోటోకాల్ ననుసరించి అన్నీ ఏర్పాట్లతో పాటు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల పరిశీలన..జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్

**జగిత్యాల, వుదయం**

జిల్లాలోని 5 మున్సిపాలిటీలు జగిత్యాల ధర్మపురి కోరుట్ల మెట్ పెల్లి రాయికల్ లో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలను కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ ద్వారా జరుగుతున్న పోలింగ్ సరళిని బుధవారం పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ వివిధ మున్సిపాలిటీల లోని పోలింగ్ కేంద్రల్లో పోలింగ్ కేంద్రం లోపల ఓటింగ్ సరళి పోలింగ్ కేంద్ర బయట ఓటర్ల రద్దీ వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు అలాగే పోలింగ్ జరుగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు రిపోర్ట్ లను సూచించిన సమయం ప్రకారం ప్రతి రెండు గంటలకు ఒకసారి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

# అడుగడుగునా ఉత్కంఠగా.. అయినా ప్రశాంతంగా..



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికలు వివాదాలు, ఆరోపణలు, దొంగ ఓట్ల కలకలం లాంటివి కొనసాగినప్పటికీ మొత్తానికి షాద్ నగరలో 76.24 శాతం పోలింగ్ శాతం నమోదై ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీకి బిఆర్ఎస్, బిజెపి పార్టీల మధ్య అభ్యర్థులతో స్వల్ప వివాదాలు చోటు చేసుకున్నాయి. ఉద్రిక్త వాతావరణానికి దారి తీయకుండా పోలీసులు వెంటనే అప్రమత్తం కావడంతో ఎన్నికల ప్రక్రియ సమయానుకులంగా పూర్తయింది. షాద్ నగర్ మున్సిపాలిటీలో మొత్తం 53,403 ఓట్లకు గాను 40 వేల మందికి పైగా ప్రస్తుతం బ్యాలెట్ బాక్స్ లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు 13వ తేదీన వెలుగులోకి రానుంది. ఒక్కసారి మున్సిపాలిటీ ఎన్నికలు కొనసాగిన తీరును పరిశీలిస్తే.. ఇలా మొదలైంది.. పట్టణంలోని 28 వార్డుల లోను ఎలాంటి జాప్యం లేకుండా ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. అయితే ఉదయం మందగొండిగా ఉదయం 9 గంటల వరకు కేవలం 11.84 శాతం ఓట్లు మాత్రమే నమోదయ్యాయి. మధ్యాహ్నం మూడు గంటల వరకు 65.28% ఓట్ల శాతం 34,843 పోలైన ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన పోలింగ్ లో మొత్తం 76.24 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారిని కమిషనర్ సునీతా రెడ్డి మీడియాకు తెలిపారు. పలుచోట్ల జనం క్యూలో నిలబడి ఓట్లు వేయడం కనిపించింది. మొత్తం 28 వార్డులకు 92 మంది అభ్యర్థులు ఉండగా ఎన్నికల నిర్వహణలో 380 మంది సిబ్బంది, 200 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. తర్వాత ఓటర్ల రావడానికి నిలిపివేసి 5 గంటలకు అక్కడికి చేరిన ఓటర్లకు మాత్రం ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో కొంతమంది ఆలస్యంగా రావడం వల్ల తమ ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. వార్డుల వారిగా పోలింగ్ శాతం.. ఒకటో వార్డులో 81.30 శాతం, రెండో వార్డులో 78.17, మూడో వార్డులో 80.56, నాలుగో వార్డులో 73.78, ఐదో వార్డులో 75.13. ఆరో వార్డులో 72.16, ఏడవవార్డులో 75.94, ఎనిమిదో వార్డులో 77.20, 9వ వార్డులో 79.45, పదవ వార్డులో 72.70, 11వ వార్డులో 82.23, 12 వ వార్డులో 81.25, 13 వార్డులో 80.35, 14 వ వార్డులో 81.46, 15 వార్డులో 79.26, 16వ వార్డులో 74.94, 17వ వార్డులో 77.41, 18 వ వార్డులో 70.38, 19 వార్డులో 80.92, 20 వార్డులో 73.65, 21వ వార్డులో 73.9, 22 వార్డులో 79.35, 23వ వార్డులో 76.33, 24 వ వార్డులో 66.53, 25వ వార్డులో 69.42, 26వ వార్డులో 72.07, 27 వార్డులో 74.74, 28వ వార్డులో 70.83 మొత్తం 76.204 శాతం పోలింగ్ నమోదయింది. అతి తక్కువ 24 వ వార్డులో 66.53 ఓట్ల శాతం నమోదయింది. అత్యధికంగా 82.23% నమోదయింది. వివాదాల పరంపర.. కొన్ని వార్డుల్లో పార్టీ నాయకులు, అభ్యర్థుల వివాదాలు పోలీసులకు సవాలుగా మారాయి. పట్టణంలోని 9, 10, 15 వార్డుల్లో చెదురు మదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. అలాగే 9, 16 వార్డుల్లో దొంగ ఓట్ల కలకలం చెలరేగింది. ఇద్దరు మహిళల ఓట్లు ఇతరులు వేసి వెళ్లిపోవడంతో వాస్తవ ఓటర్లు వచ్చి ఎన్నికల కేంద్రం వద్ద ఆవేదనతో వెనుతిరిగారు.9, 10, 15 వార్డుల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల మధ్య వివాదం జరిగింది.అయితే పోలీసులు సమయానుకూలంగా అప్రమత్తమై ఉద్రిక్త వాతావరణం ఏర్పడకుండా నిరోధించారు. పట్టణంలోని పదవ వార్డులో ఓటర్లను ప్రలోభ పెడుతున్నారనే ఆరోపణ మీద కాంగ్రెస్ నాయకుడు జమ్రుద్ ఖాన్, బీఆర్ఎస్ నాయకుడు పిల్లి శేఖర్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. పోలీసులు అప్రమత్తం కావడంతో గుంపును చెదరగొట్టి వివాదం పెరగకుండా అడ్డుకోగలిగారు. ఇక 15వ వార్డులోనూ కాంగ్రెస్– బీఆర్ఎస్ నాయకుల మధ్య వివాదం జరిగింది. కాంగ్రెస్ దౌర్జన్యం చేస్తుందని బిఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ దౌర్జన్యానికి పాల్పడుతుందని కాంగ్రెస్ నాయకులు పరస్పరం ఆరోపించుకున్నారు. ఇక్కడ కూడా పోలీసుల చొరవతో గొడవ సద్దుమణిగింది. ఇక ఎన్నికల చివరి దశలో 9వ వార్డులో బిజెపి నాయకులు దొంగ ఓట్లు వేయిస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపించడం వివాదానికి తెరతీసింది. ఏసీపి లక్ష్మీనారాయణ రంగంలోకి దిగి గొడవ పెరగకుండా అడ్డుకున్నారు. అదేవిధంగా 27 వ వార్డులో ఉత్తర ప్రదేశ్ కు చెందిన మహిళపై బిజెపి అభ్యర్థి మంగ విజయ్ దౌర్జన్యానికి పాల్పడ్డాడనే ఆరోపణలు వచ్చాయి. సిపి సుధీర్ బాబు పర్యటన.. ఫరూక్ నగర్ మండల కేంద్రంలో రెండు వార్డులను సైబరాబాద్ సిపి సుధీర్ బాబు డిసిపి శిరీషతో కలిసి సందర్శించారు. వార్డులలో ఎన్నికల సర్వే ఎలా జరుగుతుంది అన్నది ఆయన తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, ఎన్నికల విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పు అని హెచ్చరించారు. అదేవిధంగా ఆర్డీవో సరిత, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమారులు ప్రతి వార్డు తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. అధికారులు, సిబ్బంది కూడా నిర్విరామంగా ఎన్నికల విధుల్లో పాల్గొని ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించారు. దొంగ ఓట్ల కలకలం.. కొన్ని వార్డుల్లో దొంగ ఓట్ల కలకలం ఆందోళన లేపింది. ఇంతకుముందు చెప్పుకున్నట్లు 9వ వార్డులో ఇదే అంశంపై వివాదం చోటు చేసుకోగా 8వ వార్డులో పోలీసు కూతురు చందనకు తొలిసారి ఓటు వేసే అవకాశం లేకుండా ఎవరో దొంగ ఓటు వేసి వెళ్లడం ఆందోళనకు దారితీసింది. అదేవిధంగా పదో వార్డు లో కూడా కొంతమంది దొంగ ఓట్లు వేసినట్లు ఆయా పార్టీల నాయకులు ఆరోపించారు. మొత్తానికి ఎన్ని వివాదాలు ఉన్నప్పటికీ ఎన్నికలు మాత్రం ప్రశాంతంగా ముగిసి అటు పోలీసులను, ఇటు అధికారులను ఊపిరి పీల్చుకునేలా చేశాయి. ఏం జరుగుతుందక్కడ.. నాకు తెలియాలి.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మున్సిపాలిటీలో తన ఓటు లేకపోవడంతో ఎక్కడ కూడా ఆయన ఎన్నికలు జరిగే చోటికి రాలేదు. అయితే తన పార్టీ కార్యాలయంలో కూర్చుని ఎప్పటికప్పుడు ఏ వార్డులో ఓటింగ్ సరళి ఎలా ఉంది. తమ పార్టీకి ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా.. ఏదైనా వివాదాలు జరుగుతున్నాయా.. ఓట్ల వ్యవహారం ప్రశాంతంగా ఉందా లేదా.. అన్న వివరాలను నాయకులు, కార్యకర్తల ద్వారా తెలుసుకున్నారు.